# చందమామ

"రమేష్" ఎంత చక్కని పేరు- మీకెందుకు నచ్చలేదో నాకు తెలియదు ఇదీ విష్ణువుపేరేగా, సామాన్యంగా అందరూ పెట్టుకోరు కూడాను."

మనం అందరిలో చేరమా కల్యాణీ! వాడుక పేర్లెందుకు పనికిరావు? బాబును "రామం" అనే పిలుద్దాం!"

"అబ్బ ఎంత పాత పేరు! అయినా మీకెందుకీ పట్టుదల? మీ వాళ్ళంతా కలసి సెలక్టు చేసారా ఏం అంత చక్కని పేరు?"

"మా వాళ్ళెవరూ ఏం చెప్పలేదు. పేరు ఇష్టం నాకే వదలివేసారు. కాని నేను బయలుదేరినప్పుడు చంద్రయ్య మామవెంట వచ్చాడు స్టేషన్ వరకూ."

"చిన్నబాబు గారూ, బాబుకు ఏం పేరు పెడ్తారండీ" అన్నాడు. నేను నవ్వుతూ "ఏం పేరు పెట్టమంటావు మామా" అన్నా "ముసలోణ్ణి నేను చెప్పే పేరు మీకు? నచ్చుతుందా బాబూ" అన్నాడు. "చెప్పు నీవు చెప్పినట్లే పెడ్తా" అన్నాను. కొంచెం తటపటాయించి "అయితే "రామం" అని పెట్టండి" అన్నాడు. ఎందుకో అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఏం మామా అట్లావున్నావ"న్నా. "ఏం లేదు బాబు. త్వరగా వస్తావుగా అమ్మాయి గార్ని బాబును త్వరగా తీసుకు రండి" అన్నాడు. "ఏ పేరయితే ఏమిలే కళ్యాణీ బాబును రామం అనే పిలుద్దాం. చంద్రయ్య మామ సంతోషిస్తాడు" అన్నాడు కృష్ణమూర్తి.

కళ్యాణి ముఖమెఱ్ఱగా అయింది. అయితే యిక వంటవాడి సలహాతో బాబుకు పేరు పెడ్తారా? అతణ్ణి మీరు "మామ" అంటేనే నాకు సిగ్గుగా వుంటుంది. ఆ పైన అతడు చెప్పాడుట. ఆ పేరు బాబుకు పెట్టాలట. ఎవరైనా వింటే నవ్వరూ!"

కృష్ణమూర్తి కోపంతో లేచి నిలబడ్డాడు "నీ ఇష్టం వచ్చిన పేరు పెట్టుకో నీ కొడుక్కి. నేనిప్పుడే వెళ్ళిపోతాను. నాకేమీ సంబంధం లేదు నీతోను-వాడి పేరుతోనూ" అన్నాడు.

కళ్యాణి నిర్ఘాంత పోయింది. అరవకండి మీకు పుణ్యముంటుంది. మీరన్న మాటలు మా వాళ్ళు వింటే, తల పగలగొట్టుకున్నా, నా సిగ్గు తీరదు. ఏడి పేరు మీ యిష్టం! రామం కాదు—రామిగాడు, రామప్పా అన్నా నేనేం కాదనునుగా."

కృష్ణమూర్తి కోపం కరిగిపోయింది కాని అప్పుడే లాలిస్తే కల్యాణి గారాలు సాగిస్తుందేమోనని భయంతో ఆవలిస్తూ నిద్ర కొరిగాడు.

మరునాడు భారసాల. కృష్ణమూర్తి బియ్యంలో ముచ్చటగా "రామం" అని వ్రాశాడు. కళ్యాణి చెల్లెలు రేవతి "ఛీ, మా క్లాస్‌మేట్సందరితో బాబు పేరు "రమేష్" అని చెప్పానే అక్కా. సాయంత్రం వాళ్ళు టీకి వచ్చినప్పుడడిగితే నీవు అలాగే చెప్పు అయినా మీ వాళ్ళు బస్తీలో సెటిల్ ఐనా పల్లెటూరి వాసనలు పోలేదు బాబూ" అంది. కల్యాణికి వుడుకుమోత్తనం వుబికి వచ్చింది. మరి రెండురోజులయాక కృష్ణమూర్తి కల్యాణిని, రామాన్ని తీసుకొని యింటికి వెళ్లాడు. కృష్ణమూర్తి తల్లి పార్వతమ్మ కోడలుకు, మనుమడికి దిష్టి తీసి పోసింది. నిప్పులో వేసిన ఉప్పు "టప్" మనలేదట!

చంద్రయ్య "క్రొత్త బాబు"ను చూడటానికి వాకిట్లోకి వచ్చాడు వంటింట్లోంచి. చేతుల కంటిన మసైనా సరిగా తుడుచుకోకుండా! కృష్ణమూర్తి చంద్రయ్యను చూచి "మామా నీమనుమడు వచ్చాడుచూచుకో" అన్నాడు. పార్వతమ్మ పకపకనవ్వి "చంద్రయ్యకు మనుమడేమిటిరా?

అందరూ వాడి కల్లుళ్ళే" అంది. చంద్రయ్య రాముసెత్తుకొని "మామా అని పిలచిన వాళ్ళందరికీ మామనేకాని మాటలు రాని వాళ్ళకు కూడ మామనే నేంటమ్మా" అని నవ్వి రాముని ముద్దు పెట్టుకుని కల్యాణి కిచ్చి వెళ్ళిపోయాడు. తర్వాత కల్యాణి రాముని ఒంటి కెక్కడా మసి అంటకపోయినా, పియర్సు సబ్బు సగం అరిగే వరకు వాణ్ణి కడిగి పడుకో బెట్టింది.

కాలం దొర్లుకు పోతుంటే చాల కళ లబ్బుతున్నాయి రామానికి. వాడు పాకటం నేర్చాడు. గడపలు దాటుతున్నాడు. కల్యాణికంటె ముందే లేచి పాకుకుంటూ వంటింట్లోకి వెళ్ళేవాడు.

ఒకరోజు పుదయం కల్యాణి నిద్ర లేచి వస్తూ, వంటింట్లో పిల్లల గోల విని అక్కడికెళ్ళి దూరం నుంచే చూసింది. చంద్రయ్య రామానికి పాలు త్రాగిస్తున్నాడు. తోటికోడలు పిల్లల విశ్వం, సుగుణ అక్కడే వున్నారు. విశ్వానికి ఆరేళ్ళు. సుగుణ వాడికన్నా పెద్దది. సుగుణ చంద్రయ్య భుజంమీద చెయ్యి వేసితట్టుతూ "చంద్రయ్య మామా రాముకి నే త్రాగిస్తా ఆ గ్లాసిటివ్వవూ" అంటోంది గోముగా. విశ్వం పాలు త్రాగుతున్నవా డల్లా ఆగి ఏదో పెద్ద ఆలోచించి "అక్కా, చంద్రయ్య మామ నాన్నకూ, అమ్మకూ, చిన్నాయనకూ, నాకూ, నీకు — అందరికీ మా మెట్లావుతాడే" అన్నాడు. సుగుణ కర్థం కాలేదు వాడి ప్రశ్న! చంద్రయ్య బిగ్గరగా నవ్వాడు రాముడి మూతి తుడుస్తూ! విశ్వం గభాలున త్రాగుతున్న పాలు చంద్రయ్య మీద పోసాడు. కొంచెం చింది రాముడి మీద పడ్డాయి. "అదేంటి బాబూ పాలు పారపోశావేం" అన్నాడు చంద్రయ్య. "మరి నన్ను చూచి నవ్వుతావేం?" అన్నాడు విశ్వం!

పాలతో తడిసిన చంద్రయ్య చొక్కామీద టప టపా చేతులతో కొడ్తూ నవ్వుతున్నాడు రామం! కల్యాణి ఇక ఆగలేక పోయింది! గబగబ వెళ్ళింది వంటింట్లోకి. చంద్రయ్య ఆమెను చూచి కొంచెం ఆశ్చర్యపడి రామాన్ని అందించాడు! కల్యాణి వాణ్ణి ఎత్తుకుని వస్తూ అనుకుంది. "వీడి కింకా మాటలు రాలేదు సరే, మాటలు వస్తే చంద్రయ్యను మామా

అని పిలుస్తాడు తోటికోడలు పిల్లలు లాగే! ఛీ తన కసహ్యం వేసింది. యీ సంగతి అమ్మా వాళ్ళకు తెలిస్తే నవ్వటమే కాదు - నాలుగు తిట్టారు కూడ!

కల్యాణి తల్లి, కూతురు కేదో నలతగా వుందని తెలిస్తే చూడ టానికి వచ్చింది రేవతి కూడ వచ్చింది తల్లితో. ఆ సాయింత్రం; ఆ వూళ్ళోనే వుంటున్న తన తోటికోడ లింటికి, వియ్యపురాలిని, కోడలు చెల్లెల్ని తీసికెళ్ళింది పార్వతమ్మ. పిల్లల్ని తీసికొని కల్యాణి తోటికోడలు కూడా వెళ్ళింది వారితో, కృష్ణమూర్తి క్లబ్బు కెళ్ళాడు. కల్యాణి ఒక్కతే వుంది ఇంట్లో వూలు ముందేసుకొని స్వెటర్ అల్లుతూంది. రామం సోఫాలో అమ్మ ప్రక్కనే కూర్చుని వూలంతా విప్పి చిక్కు చేస్తున్నాడు వాడితో విసిగిపోయి అక్కడి కది తెంపి ఇంకొక వూలు బంతి తెచ్చుకుని అల్లుతుంది కల్యాణి. వున్నట్టుండి రామం కెవ్వున అరిచాడు. ఏ సూదో గుచ్చుకుం దనుకొని తటాలున వాణ్ని ఒళ్ళోకి తీసికొన్నది. కాని వాడు ఏమిటో బిగుసుకు పోయాడు. పళ్ళు కరిచేసుకున్నాడు దగ్గిరగా, పిచ్చి చూపు పడింది. "చంద్రయ్యా చంద్రయ్యా" అని అరిచింది గట్టిగా. ఆ ఇంట్లో చంద్రయ్యను వరస లేకుండా పిరిచేది కల్యాణి ఒక్కతే! చంద్రయ్య పరిగెత్తి వచ్చాడు. చేతిలో అట్లకాడతోనే! "చంద్రయ్యా బాబు చూడు ఎందుకో బిగుసుకుపోయాడు ఎవ్వరూ లేరు త్వరగా వెళ్ళి డాక్టరును పిలుచుకురా" అంది చంద్రయ్య ఆశ్చర్యముగా రామాన్ని చూచాడు "ఇది చిన్నబిడ్డ గుణమమ్మా, డాక్టరేం చేస్తాడు దీనికి, నే చెప్తానుండు అని వెళ్ళి ఎర్రగా కాలిన పొగాకు చుట్ట తెచ్చి, దానితో రామం ముఖం మీద మాసిపోని మచ్చ చేసాడు. రామం కళ్ళు విప్పాడు. చూపు మారింది. ఏడ్వటం మొదలెట్టాడు. "ఇంకేం భయం లేదమ్మా" అని రామానికి దిష్టితీసి వెళ్ళాడు చంద్రయ్య.

"అయ్యో డాక్టరును పిలిపించేదానికి ఇలా ఎలా కాల్పించావే" అంది కల్యాణి తల్లి!

"నీకేమైనా మతిపోయిందా అక్కయ్యా? ఒక ఇంజక్షన్‌తో పోయే

దానికి ఇలా ముఖం మీద కాల్చిస్తారా? ఎంత పెద్ద మచ్చ పడుతుందో ఏమో! మళ్ళీ పోనుకూడ పోదు. ఒక మచ్చ ఎంత అందాన్నైనా Spoil చేస్తుంది. అందులో ముఖంమీద ఇంకెందుకైనా పనికి వస్తాడా వీడు" అన్నది రేవతి.

పార్వతమ్మ ఆ మర్నాడు వుపవసించి గుళ్ళో కెళ్ళింది మనవడ్ని బ్రతికించిన దేవుని ఋణం తీర్చినట్లు తృప్తి పడింది. కృష్ణమూర్తి "చంద్రయ్య మామ కూడా లేకపోతే ఏమయ్యేదో" అన్నాడు.

ఆనాటి సంఘటనతో కల్యాణికి చంద్రయ్యపై ఒక రకమైన కృతజ్ఞతాభావ ముదయించినా, తల్లి, చెల్లెళ్ళ మాటలు విన్నాక అది కాస్తా ద్వేషంగా మారింది. కొడుకు నుదురుమీద మచ్చ చూచినపుడెల్లా చంద్రయ్యను తిట్టుకునేది మనస్సులో.

రామానికి మాటలు వస్తున్నాయి. కల్యాణి వాణ్ణి చంద్రయ్య దగ్గర కెక్కువగా వెళ్ళనిచ్చుటలేదు. ఒకరోజు తను స్నానంచేసి వస్తూ చూసింది. చంద్రయ్య రామాన్నెత్తుకుని "మామా అను బాబూ మామా మామా" అంటున్నాడు. కల్యాణి సబ్బుపెట్టి అక్కడే జారవిడచి గబగబా చంద్రయ్య దగ్గరకు వచ్చి రామాన్ని లాక్కొని "గదిలోంచి బైటకెందు కొచ్చావ్, ఇంక రావుగదా" అంటూ ఛెళ్ళున రెండు దెబ్బలు వేసింది. రామం కెవ్వుమన్నాడు. "ఎందుకమ్మా బాబును కొడ్తారు" అన్నాడు చంద్రయ్య. "నేను కొడ్తానని తెలిసి వుండి కూడ నీ వెందు కట్లా పిలిపించుకుంటావ్" అని రామాన్ని బరబరా యీడ్చుకెళ్ళింది తన గదిలోనికి. చంద్రయ్య కారోజు అన్నం సహించలేదు. ఆ సాయింత్రం పార్వతమ్మ దగ్గరకెళ్ళి "అమ్మా మా తమ్ముడి పిల్లలను చూసి వస్తా, చాల రోజులయింది ఒక నెలవుండి వస్తా" అన్నాడు. పార్వతమ్మ పెద్ద కొడుకుతో చెప్పింది. మర్నాడు డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు చంద్రయ్య.

కల్యాణి మనస్సు కుదుట పడింది. కాని ఆమె తోటి కోడలు మాత్రం, పిల్లలను సముదాయించలేక విసిగిపోయింది. పదిరోజులయ్యాక

భర్తతో చెప్పింది చంద్రయ్యను త్వరగా రమ్మంటూ వుత్తరం వ్రాయమని. వారం తిరిగేప్పటికి చంద్రయ్య తమ్ముడి వద్దనుంచి వుత్తరం వచ్చింది. చంద్రయ్య వాళ్ళవూరు అసలు రానేలేదని వ్రాసాడు. అందరూ విస్తుపోయారు. నెలలు గడుస్తునే వున్నాయి చంద్రయ్య వచ్చేది కనపడుట లేదు. కల్యాణికిమాత్రం పెద్ద భారం తీరిపోయింది. ఇక తనబిడ్డ అస్తమానము తనదగ్గరే వుంటాడు. తననే మరిచేంత చనువు ఇంకెవ్వరి దగ్గరా లేదు రామానికి!

అయిదార్లు ముప్ఫయి ఋతువులు దొర్లి పోయాయి. కృష్ణమూర్తి కల్యాణి తిరుపతి వెళ్ళి తిరిగి వస్తున్నారు–రామానికి తల గుండుచేయించి. కాళహస్తిలో దిగారు. ఏదో చిన్న హోటల్ కనపడితే అక్కడికెళ్ళారు భోజనానికి. భోంచేస్తున్న కృష్ణమూర్తి హోటల్ యజమానిని జూసి "ఏమిటండీ ఆ గోల? పిల్లలు అరుస్తున్నారు" అన్నాడు.

హోటల్ యజమాని "మా హోటల్లో ఒక ముసలివాడున్నాడండీ! క్రొత్తలో చాల పని చేసేవాడు. శక్తి తగ్గింది. తెలియని పనంటూ లేదు కనుక రోజూ అన్ని పనుల్లో కాస్త చేయిచేసుకుంటాడు. దగ్గు. తిన్న రోజు తింటాడు లేకపోతే లేదు. జీతం తీసుకోడు. రోజూ యీ వేళప్పుడు వస్తారొక డజనుమంది పిల్లలు. అందరికీ తలో గారే, ఇడ్లీనో పెట్టి పంపుతాడు" అన్నాడు. "నా అనే వాళ్ళెవరూ లేరేమో పాపం" అంది కల్యాణి. చేయి కడుక్కునేందుకు బైటకు వెళ్ళిన కృష్ణమూర్తి "కల్యాణీ త్వరగారా" అన్నాడు.

కృష్ణమూర్తి, పిల్లల మధ్యలో దగ్గు నాపుకొని నవ్వలేక నవ్వుతున్న చంద్రయ్య నిట్టే గుర్తుపట్టాడు. కండలు కరిగిపోగా, వున్న ఎముకల్లో గూడా ఓపికలేదు చంద్రయ్యకు. "మామా ఇలా అయిపోయావేం" అన్నాడు కృష్ణమూర్తి దగ్గరకెళ్ళి "ఆ– బాబు. ఎన్నాళ్ళకు చూసాను. విశ్వం; సుగుణ, రామం అందరూ బాగున్నారా" అన్నాడు. "ఆ– రామం ఇక్కడే వున్నాడు చూడు" అని కల్యాణిని పిల్చాడు కృష్ణమూర్తి. చంద్రయ్య తన ఎముకల చేత్తో రామం ఒళ్ళు నిమిరాడు. కళ్ళలో ధనీ

నిలచింది "మందూ మాకూ లేవు సరికదా, తిండికూడా లేకుండా వుంటున్నావేం మామా" పద మనింటికి వెళ్దాం" పిల్లలు నీ కోసం బెంగ పడ్డారు కూడా కొన్ని రోజులు" అన్నాడు కృష్ణమూర్తి.

"పిల్లలు బెంగ పడ్డా త్వరగానే మర్చిపోతారు బాబూ, నాకే ముప్ఫయి ఏళ్ళనుంచి బెంగ బెంగగానే వుంది. నా రాముడు! చివర దగ్గు దగ్గే వరకు మరచిపోలేను పది రోజుల రాముణ్ని విడిచిపెట్టి చచ్చిపోయింది నా చెల్లెలు. దాని మొగుడు మళ్ళీ పెళ్ళాడాడు. రాముణ్ని నే తీసికొచ్చి పెంచుకున్నాను. వాడి కోసం పెళ్ళి చేసుకోలేదు "మామా" అనే వాడు నన్ను. పది రోజుల వాడిని పదేళ్ళ వాణ్నిగా చేసాను. "ఏదో జబ్బు బాబు నన్నన్యాయం చేసి పోయాడు రాముడు. ఆ తర్వాతఎంత మంది పిల్లల్నో చూచాను. అప్పుడప్పుడు రాము కన్పించేవాడు కొంద రిలో. అట్లా ఒక అర డజను మంది రాముళ్ళను పెంచాను బాబూ ఎంత ఆశపడినా ఒక్కడూ నారాముడు కాలేదు." కృష్ణమూర్తి వణికి పోయాడు. "ఇదిగో వీడు నీ రాముడే మామా పద యింటికి" అన్నాడు "వద్దు బాబూ నేను రానులే, ఆ రాముడెట్లాగూ మర్చిపోయాడుగా నన్ను, ఇప్పుడు నేను మీతోవస్తే యీ పిల్లలంతా గారెముక్కలు లేక బెంగ పెట్టుకుంటారూ మరి! అని పల్చగా నవ్వాడు.

"అయితే అమ్మా వెంటనే కాలిస్తే—ఉహుఁ డాక్టరును పిలవ లేదా అమ్మా" అన్నాడు చంద్రయ్య, కల్యాణికి పాత సంఘటనలు గుర్తు వచ్చాయి. కంఠం పూడిపోయింది. ఎలాగో బిగపట్టి "వచ్చేసరికే ఆలస్య మైంది" అంది.

చంద్రయ్య రామాన్ని ఇంకోసారి ముద్దాడి ఒక గారె ఇచ్చాడు.

బరువెక్కిన గుండెతో ఇల్లు చేరాడు కృష్ణమూర్తి. వెన్నెలలో మేడమీద కూర్చున్నాడు కృష్ణమూర్తి. కల్యాణి కబుర్లు చెప్పుకుంటూ గంతులు వేస్తున్న రామం కల్యాణిఒళ్ళో చేరి "అమ్మా చంద్రుణ్ణి చంద మామ అంటారెందుకమ్మా" అన్నాడు. రామం ప్రశ్నతో కృష్ణమూర్తి

పులకరించిపడ్డాడు. "కల్యాణీ, చంద్రయ్య మామ ఎట్లా వున్నాడో" అన్నాడు.

"చెప్పమ్మా చెప్పు, చంద్రుడు అందరికీ మామయ్యేనా అమ్మా! చెప్పు నాన్నతో తర్వాత మాట్లాడుదువు గానిలే" అన్నాడు రామం.

"ఏమురా చంద్రయ్య మామ అందరికీ మామయ్యే. పిల్లలు వుట్టారు. పెరిగి పెద్దవాళ్ళవుతారు. ముసలి వాళ్ళుకూడా అవుతారు కాని చంద్రయ్య మామకు మాత్రం అందరూ అల్లుళ్ళే-అందరికీ మామ-చంద్రయ్య మామ" అన్నాడు కృష్ణమూర్తి.

"నాన్నా చంద్రయ్య మామ అంటావేమిటి నువ్వు చందమామ-అనాలి గాని" అన్నాడు రామం.

"రెండూ ఒకటేరా" అంది కల్యాణి. అందరూ తలెత్తి చందమామను చూచారు చందమామ చంద్రయ్య నవ్వులాగా చాలా స్నిగ్ధంగా వుంది. గారె ముక్కల కోసం కాకోలు చాలా ముక్కలు చేరాయి చందమామ చుట్టూ. చందమామలో ప్రత్తి వడికే ముసలమ్మ లేదూ—కుందేలూ లేదు. దగ్గు నాపుకుంటూ నవ్వలేక నవ్వుతున్న చంద్రయ్య మామ వున్నాడు.

—o—